# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 14, మే 2026




## రైతుల సమస్యలను చరవాణి ద్వారా పరిష్కరించిన కలెక్టర్



**ఆసిఫాబాద్, మే 13, ప్రభాతవార్త :**

రైతులు వరి ధాన్యం ఆరబెట్టి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే తప్పనిసరిగా కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లాలోని రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన కౌలుదారు సందీప్ తన పొలం వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ చేసిన అభ్యర్థనపై జిల్లా కలెక్టర్ స్పందించి బుధవారం టెలిఫోన్ ద్వారా సదరు సందీప్ తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ధాన్యాన్ని తేమశాతం, మట్టి గడ్డలు వంటి నిబంధనలు పాటించి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చినట్లయితే ధాన్యం కొనుగోలు చేస్తామని అవగాహన కల్పించడంతో సదరు సందీప్ అంగీకరించి కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తానని తెలిపారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలో 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో గోనె సంచులు అందించి ధాన్యం నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.



## సాధించాలనే పట్టుదల ఉన్నవారిని ప్రోత్సహిస్తాం

### రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**మంచిర్యాల బ్యూరో, మే 13, ప్రభాతవార్త**

ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ఉన్న వారిని ప్రోత్సహిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో టామ్ కామ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ కుమార్, టామ్ కామ్ సంస్థ మేనేజర్ అనిల్ కుమార్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ సరైన విద్య, నైపుణ్యత కలిగిన వారికి విదేశాలలో మంచి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విదేశాలలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సరైన అర్హత కలిగిన వారికి ఆయా దేశాల భాష నేర్పించి ఉపాధి కల్పించడంలో టామ్ కామ్ సంస్థ మంచి పని చేస్తుందని తెలిపారు. జర్మనీ, జపాన్, ఇజ్రాయిల్ దేశాలతో పాటు గ్రీస్, యూరోప్ వంటి దేశాలలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యత, అనుభవం కలిగిన వారి కొరకు ఆయా దేశాలు సంప్రదిస్తున్నాయని తెలిపారు. అర్హత, నైపుణ్యత గల వారికి ఆయా దేశాలలో వారానికి 35 గంటల పని ఉంటుందని, దాదాపు 2 లక్షల రూపాయల వరకు వేతనం వస్తుందని తెలిపారు. ఈ క్రమంలో యువతకు ఉపాధి కల్పించడంలో మందమర్రి ప్రాంతంలో శిక్షణ కేంద్రం ప్రారంభించడం సంతోషంగా ఉందని, జూన్ 10వ తేదీ నుండి ఉదయం 4 గంటలు, సాయంత్రం 4 గంటలు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నర్సింగ్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ వంటి అనేక రంగాలలో నైపుణ్యత గల అభ్యర్థుల కోసం అవకాశాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం టామ్ కామ్ సంస్థకు 90 కోట్ల రూపాయలు అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మందమర్రి నుండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తరువాత బ్యాచ్‌కు ఆదర్శంగా మారాలని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు వెళ్లాలని, చిత్తశుద్ధితో పనిచేసి డబ్బులు సంపాదించుకోవాలని, మనతో పాటు మరింత మందికి అభివృద్ధి చెందే అవకాశం కల్పించి చేయూత అందించాలని తెలిపారు. మనం కష్టపడి సంపాదించి ఖర్చు పెడితే గౌరవం ఉంటుందని, మన కుటుంబాన్ని సక్రమంగా చూసుకోవచ్చని తెలిపారు. పారిశ్రామిక శిక్షణా సంస్థ, సింగరేణి సంస్థల ద్వారా అనేకమంది

మిగతా 2లో..

## బస్సు ఢీకొని.. బాలుడి మృతి



**ఆసిఫాబాద్ టౌన్, మే 13, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో బుధవారం బస్సు ఢీకొన్న సంఘటనలో ప్రమాదవశత్తు బాలుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెంచికల్పేట మండలం కొండపల్లి గ్రామానికి చెందిన భీంరావు కుటుంబ సభ్యులు బుధవారం వాంకిడి మండలంలోని బంధువుల ఇంటో శుభకార్యానికి వెళ్లి తిరిగి పెంచికల్పేటకు వెళ్లెందుకు ఆసిఫాబాద్ బస్టాండుకు వచ్చారు. బస్టాండులో కాగజ్నగర్ బస్సు రావడంతో ఎక్కేందుకు నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో ఊట్నూరు డిపోకు చెందిన బస్సును డ్రైవరు వెనుకకు తీస్తున్న క్రమంలో నానమ్మ ఒడిలో ఉన్న తరుణ్(14నెలలు)ను బస్సు బలంగా తగలడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన చిన్నారిని మొదట ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు బాలున్ని మంచిర్యాలకు రెఫర్ చేయగా అక్కడి ఆసుపత్రి వైద్యులు పరిక్షించి మిగతా 2లో..

### మాట్రిమోనిలో పరిచయం..

## మహిళ మెడలో బంగారు గొలుసుతో పరారీ

**హాజీపూర్, మే 13, ప్రభాతవార్త**

విడాకులు తీసుకున్న ఒంటరి మహిళలే టార్గెట్ గా నల్గొండ జిల్లా మిర్యాలగూడ కు చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ (38) కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను షాది.కం మాట్రిమోని ద్వారా కర్ణమామిడి గ్రామానికి చెందిన రాంపెల్లి రజిత అనే మహిళతో పరిచయం చేసుకొని తనని పెళ్లి చేసుకుంటాను అని నమ్మించాడు. తేదీ 01.05.2026 రోజు శిరీష్ కుమార్ మధ్యాహ్నం సమయంలో తన యొక్క ఏపీ 39 ఎస్‌డి 9060 నెంబర్ గల మోటార్ సైకిల్ వేసుకొని కర్ణమామిడి గ్రామం లోని రజిత ఇంటికి వచ్చి పెళ్లి కొరకు రజిత కు బంగారం చేపిస్తా అని చెప్పి అదే బైక్‌పై రజితను ఎక్కించుకొని మంచిర్యాలలోని ఒక బంగారు షాప్‌కి తీసుకొని వెళ్ళి, షాప్ లో మాట్లాడిన తర్వాత తిరిగి రజితను తన బైక్ పై కర్ణమామిడి కి బయలుదేరారు. మార్గ మధ్యలో గుడిపేట ఫిష్ మార్కెట్ దాటిన తర్వాత సాయంత్రం అందాదా 06:30 గంటల సమయంలో మహారాజ్ ఫ్యామిలీ దాబా దగ్గరకు రాగా మిగతా 2లో..

### ధాన్యం కొనుగోలు ప్రక్రియ

## వేగవంతం చేయాలి

**✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**హాజీపూర్, మే 13, ప్రభాతవార్త**

2లో..



# సాధించాలనే పట్టుదల ఉన్నవారిని ప్రోత్సహిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

శిక్షణ పొంది, అప్రెంటిస్ పూర్తి చేసి అనుభవం పొందుతున్నారని, ఏకాగ్రతతో విదేశీ భాషను నేర్చుకొని విదేశాలలో పనిచేసే అవకాశం సంపాదించుకోవాలని తెలిపారు. ఈ క్రమంలో విదేశాలలో ఉన్న అవసరాలకు అనుగుణంగా అర్హత, ఆసక్తి గల అభ్యర్థులకు శిక్షణ అందించడం జరుగుతుందని, యువత తమ వివరాలను నమోదు చేసుకొని శిక్షణ పొందాలని తెలిపారు. ఈ క్రమంలో విదేశాలలో పనిచేస్తున్న మన దేశ పౌరులతో మాట్లాడినప్పుడు తాను చేసే పనికి, వచ్చే జీతానికి సంతోషంగా ఉందని, తమ కుటుంబాన్ని సంతోషంగా చూసుకుంటున్నామని తెలిపినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆలోచనతో ముందుకు వెళ్లాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విదేశాలలో ఉద్యోగ భద్రతతో కూడిన ఉపాధి కల్పించడం జరుగుతుందని, ఆయా దేశాలలో సాంఘిక భద్రత, కార్మిక చట్టాల ద్వారా కార్మికులకు సంతృప్తికరమైన ఉపాధి లభిస్తుందని తెలిపారు. వారానికి 35 గంటల పని ఉంటుందని, నిబంధనల ప్రకారం నైపుణ్యత, అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆయా దేశాలకు సంబంధించి అర్హత గల అభ్యర్థులు ఆ దేశాల భాష నేర్చుకోవాలని, సాంకేతిక నైపుణ్యత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందేందుకు వేరే ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానిక యువతకు మందమర్రి మండలంలో అందుబాటులో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత, ఆసక్తి గల నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలు

**కాగజ్‌నగర్ రూరల్, మే 13, ప్రభాతవార్త :**




కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల సందర్భంగా మూడవ రోజు ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలోని అన్ని విభాగాలకు సంబంధించిన వివిధ విద్యా, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను ఫ్లెక్సీల రూపంలో ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగానే ఈ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కళాశాల వివిధ రంగాల్లో సాధించిన విజయాలు, నిర్వహించిన కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభను ప్రతి విభాగం ప్రత్యేక ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించిందని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. లక్ష్మి నరసింహం గారు మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరింత ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు ఉత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ శ్రీ దుర్గం జనార్దన్, విశీశీ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ తూడూరు దత్తాత్రేయతో పాటు అన్ని విభాగాల ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

## రూ.35 లక్షల అంచనాతో బురుదగూడ చెరువు పునరుద్ధరణ పనులకు శ్రీకారం

**- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు**

**కాగజ్‌నగర్ రూరల్, మే 13, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని బురుదగూడ చెరువు పునరుద్ధరణ పనులకు సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు బుధవారం శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాల క్రితం వచ్చిన భారీ వరదల కారణంగా చెరువు కట్ట తెగిపోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు చొరవ తీసుకుని రూ.35 లక్షల ఓ.అండ్.ఎం నిధులు మంజూరు చేయించడంతో చెరువు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పనులను పూర్తిచేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. చెరువు పునరుద్ధరణతో పరిసర ప్రాంతాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌత్రే లక్ష్మి, ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్, డీఈ తిరుపతి, ఏఈ స్వామి, నాయకులు గోపాల్, నికోడె ప్రభాకర్, డోంగ్రే కార్తీక్, డోంగ్రే భరత్, కొట్రంగి బాబురావు, జీల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహణ

**తిర్యాని, మే13, ప్రభాతవార్త;**



తిర్యాని మండల కేంద్రంలోని గిన్నెధరి రైతు వేదికలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఏఓ వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగు విధానాలు, నేల ఆరోగ్యం, అధిక సాంద్రత పద్ధతి సాగు, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు అనిల్, రాజశేఖర్ మాట్లాడుతూ తక్కువ మోతాదులో యూరియా వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. అవసరానికి అనుగుణంగా మాత్రమే రసాయనాలను వినియోగిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడాలని రైతులకు తెలిపారు. పంట మార్పిడి విధానాలను పాటించడం ద్వారా సుస్థిర ఆదాయం పొందవచ్చని వివరించారు. మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాల సాగు చేపట్టడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే సేంద్రియ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు సాధ్యమవుతాయని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకపుగూడ ఉప సర్పంచ్ పవన్, ఖైరిగూడ ఉప సర్పంచ్ మోహన్, ఏఈఓ శ్రవణ్, వినోద్, ముత్తయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## పేద యువకుడి పెళ్లికి ప్రజాసేన ఫౌండేషన్ అండ

**తిర్యాని, మే13, ప్రభాతవార్త;**



తిర్యాని మండలంలోని మంగీ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన రాయి సీడం కృష్ణారావు అనే పేద యువకుడి వివాహానికి ప్రజా సేన ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించింది. అమ్మానాన్నలు లేని ఆ యువకుడి పెళ్లికి ఫౌండేషన్ తరఫున రూ. 6,700 నగదు సహాయంతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఫౌండేషన్ సభ్యుల సేవా భావాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మంగీ సర్పంచ్ రాయి సీడం వినోద్ కుమార్, ఉప సర్పంచ్ కనక శ్రీకాంత్, ముల్కల మంద సర్పంచ్ కుడ్మెత హనుమంతరావు, ఉప సర్పంచ్ అర్క మల్లేష్, మాజీ సర్పంచ్ కోట్నాక గణపతి, మార్సుకోల గోపాల్ (ఉపాధ్యాయుడు), కోట్నాక రాంషా, మడావి మోహతి, పంచాయతీ కార్యదర్శి పంద్రం లక్కు, పంద్రం యశ్వంత్ పటేల్, మడావి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**- ఆరుగురు నిందితుల అరెస్ట్ సీఐ రమణమూర్తి**

**లక్షెట్టిపేట, మే 13, ప్రభాతవార్త**



పట్టణంలోని బాలాజీ లాడ్జిలో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో సీఐ రమణమూర్తి నేతృత్వంలో ఎస్సై, పోలీస్ సిబ్బంది అట్టి లాడ్జిపై సోదాలు నిర్వహించి ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేయడం జరిగింది. పట్టుబడ్డ ఆరుగురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించడం జరిగింది. నిందితుల వద్ద నుంచి నగదుతో పాటు మొబైల్ ఫోన్స్ ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఆరుగురు నిందితుల పాటు లాడ్జి యజమాని పై కూడా కేసు నమోదు చేయడం జరిగింది. నిందితుల వివరాలు. మసాలా సతీష్, తిరుపతి, హేమంత్ కుమార్, ఎలేశ్వర్ సమ్మయ్య, మోపర్తి హనుమంతరావు, సయ్యద్ అబ్బాస్, నల్మాస్ మణిదీప్ తదితరులు ఉన్నారు. ఇందులో భాగంగా పేక ముక్కలు 52 (ప్లేయింగ్ కార్డ్స్), నగదు రూ.1,20,770, ఒక స్కూటీ, 6 సెల్ ఫోన్లు, నాలుగు బెడ్స్, ఒక కూలర్ స్వాధీనం చేసుకున్నారు.

## బస్సు ఢీకొని బాలుడి మృతి

(మొదటిపేజీ తరువాయి)

అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుని మృత దేహంతో కుటుంబీకులు తిరిగి ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. బాలుని మృతదేహంతో బస్టాండు ఎదుట బైఠాయించి తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. వీరికి ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. బాలుని మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పలు డిమాండ్లు చేస్తూ ధర్నాకు దిగారు. బస్టాండు ఎదుట ధర్నా చేపట్టడంతో ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడడంతో ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్, పోలీసులు సంఘటన స్థలంకు చేరి బాధిత కుటుంబ సభ్యులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డిపో మేనేజర్ రాజశేఖర్ అక్కడికి చేరుకొని తక్షణ ఆర్థిక సహాయం కింద రూ. 25 వేలు చెల్లిస్తామని ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చిరంజీవి, దినకర్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**హాజీపూర్, మే 13, ప్రభాతవార్త**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల, నమ్నూర్, రాపల్లి లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములలో నిల్వ చేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఈసారి అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మాట్రిమోనిలో పరిచయం..

## మహిళ మెడలో బంగారు గొలుసుతో పరారీ

(మొదటిపేజీ తరువాయి)

అక్కడ శిరీష్ కుమార్ తన బండిని ఎన్ హెచ్ 63 రోడ్డు పక్కకు ఆపి రజిత మెడలో ఉన్న బంగారు తాడు బరువు చూస్తా అని దానిని ఇవ్వమనగా రజిత తనకు ఇచ్చేసరికి శిరీష్ కుమార్ బంగారు తాడును తీసుకొని రజిత ను పక్కకు నెట్టివేసి తన బైక్ పై అక్కడ నుండి హైదరాబాద్ కు పారిపోయినాడు. బాధితురాలు పిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించారు. తేదీ 12.05.2026 రోజు కాళహస్తి శిరీష్ కుమార్ ని పట్టుకొని అతని వద్ద నుంచి ఏపీ 29 ఎల్ 1342 గల నెంబర్ గల కారు, ఏపీ 39 ఎస్‌డి 9060 గల నెంబర్ గల బైక్‌ను స్వాధీన పరచుకొని శిరీష్ కుమార్‌ను డిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపనైనది. అలాగే కాళహస్తి శిరీష్ కుమార్ అను అతను గతంలో కూడా ప్రకాశం జిల్లాలో మూడు బైక్ దొంగతనాలు చేసిన కేసులో జైలుకు వెళ్ళినాడు మరియు మ్యాట్రిమోని సైట్ ద్వారా తూర్పు గోదావరి జిల్లాలోని ఒక ఒంటరి మహిళ ని పరిచయం చేసుకుని అట్టి మహిళను పెళ్లి చేసుకొని ఆమె వద్ద నుండి 3,00,000 రూపాయలు తీసుకొని పారిపోవడంతో అట్టి మహిళ శిరీష్ కుమార్ పై కేసు పెట్టగా అట్టి కేసులో కూడా అతను జైలుకు వెళ్ళి కోర్టుకు హాజరు అవుతున్నాడు. వివాహ సంబందమైన సైట్ లలో పెళ్లి సంబందాలుకుదుర్చుకునేటప్పుడు వారు ఇచ్చిన వివరాల గురించి సరిగా విచారించిన తర్వాతనే పెళ్లి సంబంధం విషయంలో పెళ్లి వరకు వెళ్ళడం మంచిది. ఇట్టి కేసులో శిరీష్ కుమార్‌ని పట్టుకోవడంలో ముఖ్య పాత్ర వహించిన హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుళ్లు తిరుపతి, సత్యనారాయణ, చంద్రశేఖర్, రాజేందర్‌లను సీఐ రవీందర్, ఉన్నతాదికారులు అభినందించినారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

**- సిర్పూర్ పేపర్ మిల్ క్లబ్‌లో సర్పంచులు, కౌన్సిలర్లకు విద్యాశాఖ అవగాహన కార్యక్రమం**





**కాగజ్‌నగర్ రూరల్, మే 13, ప్రభాతవార్త :**

సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు విద్యాశాఖ ఆధ్వర్యంలో సిర్పూర్ పేపర్ మిల్ క్లబ్‌లో ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల నమోదు పెంపు, విద్యా నాణ్యత అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించడంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బలమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వ పాఠశాలలే పునాదిగా నిలుస్తాయని అన్నారు. ఒక మంచి పాఠశాల విద్యావంతులైన కుటుంబాలు, ఆరోగ్యకరమైన సమాజం, బాధ్యతగల పౌరులు, భవిష్యత్ నాయకులను తయారు చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ విద్య, విద్యార్థి సంక్షేమం, సమాజ భాగస్వామ్యం వంటి అనేక కీలక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ విద్యార్థుల అభ్యాసం, ఉపాధ్యాయుల శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. గ్రామాలు, వార్డులు, పట్టణాల్లోని పాఠశాలల అభివృద్ధిలో సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల పాత్ర ఎంతో కీలకమని, వారి నాయకత్వం పిల్లల భవిష్యత్తును మార్చగలదని సూచించారు. జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా ప్రతి నెల పాఠశాలలను సందర్శించాలని, ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి నెల పేరెంట్ టీచర్ మీటింగ్‌లలో పాల్గొనడం, పాఠశాల పరిశుభ్రతకు సహకరించడం, చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడం, బాలికల విద్యను ప్రోత్సహించడం, వికలాంగ విద్యార్థులకు మద్దతు ఇవ్వడం, క్రీడలను ప్రోత్సహించడం, విద్యార్థుల ప్రతిభను ప్రచారం చేయడం, పాఠశాలలను గౌరవంగా చూడడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత యూనిఫార్మ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, త్వరలో ప్రారంభమయ్యే అల్పాహార పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించి విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల గ్రామ సర్పంచులు, మండల విద్యాశాఖ అధికారులు సునీత, జయరాజ్, నానాజీ, కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్లు, రిసోర్స్ పర్సన్లు నరసింహ చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మోహన్ రావు పాటిల్

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మోహన్‌రావు పాటిల్

**భైంసా, మే 13, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని పలు వివాహాది శుభకార్యాలకు మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పాటిల్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం సుఖమయంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లె పల్లెకు బీజేపీ గడప గడపకు మోహన్ రావు కార్యక్రమ కన్వీనర్ మనోజ్ పాపిన్వార్, మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నెరడిగొండ, మే 13, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండలంలోని సుర్ధపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలందరూ భక్తి మార్గంలో నడవాలని సూచించారు. హనుమంతుడి ఆశీస్సులు ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుతోనే భూసారం పెంపు: శాస్త్రవేత్తలు

**సారంగాపూర్, మే 13, ప్రభాతవార్త:**

మండలంలోని ప్యారామూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు యూరియా వాడకం తగ్గించి సేంద్రియ సాగు చేపట్టాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయాలని కోరారు. పంట మార్పిడి పద్ధతులను పాటించాలని, కొంత భాగంలోనైనా సేంద్రియ వ్యవసాయం చేయాలని తెలిపారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, వరి కోతల తర్వాత అవశేషాలను తగులబెట్టకుండా పొలంలోనే కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త కె. రాహుల్, విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ కోట లింగం, రంజిత్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



## పరీక్షా లీకేజీకి కారణమైన వారిని కఠినంగా తక్షణమే శిక్షించాలి

**- ఎన్‌టిఏను రద్దు చేసి పరీక్ష విధానాన్ని మార్చాలి**

**- యుఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ**

**లక్షెట్టిపేట, మే 13, ప్రభాతవార్త**




భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్‌ఎఫ్‌ఐ) మంచిర్యాల జిల్లా కమిటీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం పట్టణంలోని అతిథి గృహంలో స్థానిక గెస్ట్ హౌస్‌లో మాదినేని మని చరణ్ అధ్యక్షతననిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ. నీట్ సహా జాతీయ స్థాయి పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయని యుఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి మాదం తిరుపతి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఎన్‌టీఏ పూర్తిగా విఫలమైందని వారు మండిపడ్డారు. పేపర్ లీకేజీల వల్ల సంవత్సరాల పాటు కష్టపడి చదివిన విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న అధికారుల నిరక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థించడం సిగ్గుచేటని విమర్శించారు. గతంలో రాజస్థాన్ కేంద్రంగా పేపర్ లీకేజైనా ఇప్పటికీ వారిని శిక్షించకుండా ఉండడం వలన ఇలాంటి ఘటన జరుగుతున్నాయని ఇది కేంద్ర ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యం నిదర్శనమని వారి మండిపడ్డారు వికసిత భారత్ అంటూ దేశవ్యాప్త విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదని అన్నారు కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని తక్షణమే ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షా లీకేజీలకు పాల్పడిన అసలు నిందితులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనల వెనుక ఉన్న అధికారులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్, రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ వాణి, జిల్లా నాయకులు మణి చరణ్, రమ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## బంకట్‌సింగ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**నెరడిగొండ, మే 13, ప్రభాతవార్త:**



నెరడిగొండ మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన బంకట్ సింగ్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కిషోర్, నానక్ సింగ్, దేవేందర్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**నేరడిగొండ, మే 13, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని వడూర్ నుండి దస్యతండా గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం భూమి పూజ చేశారు. రూ.15 లక్షల నిధులతో చేపట్టనున్న ఈ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రవాణా సౌకర్యాల మెరుగుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**లక్షెట్టిపేట, మే 13, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు త్వరితగతిన తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా రవాణా శాఖ అధికారి గోపి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ క్రాంతి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్టార్ 1, 2, 3, 4 లకు సంబంధించిన ట్రాన్స్పోర్ట్ గుత్తేదారులతో వరి ధాన్యం కొనుగోలు, ధాన్యం తరలింపు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 6 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని ఒక రోజులో దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియ అనుసంధానంగా జరగాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట మండలం గుల్లకోట, మిట్టపల్లిలలో గల శివ సాయి, శ్రీరామచంద్ర, శ్రీరామ రైస్ మిల్లులను జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి బ్రహ్మారావు, లక్షెట్టిపేట మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ లతో కలిసి సందర్శించి రైస్ మిల్లు యజమానులకు పలు సూచనలు చేశారు. కేటాయించబడిన వరి ధాన్యం త్వరగా దిగుమతి చేసుకోవాలని, వరి ధాన్యం దిగుమతి విషయంలో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని తెలిపారు. తదనంతరం కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గాను గోదాముగా మార్చిన దండేపల్లి మండలం లింగాపూర్‌లో గల రామ్ లక్ష్మిుణ్ డిఫాల్టర్ రైస్ మిల్‌ను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయబడి కేటాయించబడిన ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయానికి రూ.20 వేల విరాళం

**ఖానాపూర్, మే 13, ప్రభాతవార్త:**



కడెం మండలం మొర్రిగూడెం గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి నిర్మల్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొద్దుటూరి సతీష్ రెడ్డి బుధవారం రూ.20 వేల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో ఈ నగదును అందించారు. అనంతరం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఉప సర్పంచ్ రమ్య రవీందర్, సత్యనారాయణ, లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.


## రెండు రోజుల్లో తీర్మాన కాపీని అధికారులకు అందజేస్తాం

**- కలెక్టర్ నోటీస్‌పై స్పందించిన సర్పంచ్ తోకల మల్లేష్**

**- వడ్ల కొనుగోళ్ల దృష్ట్యా కొంతమేర జాప్యం జరిగిందని వివరణ**

**చెన్నూరు, మే 13, ప్రభాతవార్త**

చెన్నూరు మండలం సోమనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణం జరుగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిమిత్తం గ్రామ పంచాయతీ తీర్మాన ప్రతి కోసం ఎంపీడీఓ పంచాయతీ సెక్రటరీ ఆదేశాలు జారీ చేసిన విషయం వాస్తవమేనని గ్రామ సర్పంచ్ తోకల మల్లేష్ అన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనందున పాలక వర్గ సభ్యులు పనుల నిమిత్తం వెళ్లడంతో గ్రామ పంచాయతీ తీర్మానం కాపీని ఇవ్వకపోవడంలో కొంతమేర జాప్యం జరిగిందని మల్లేష్ అన్నారు. రెండు రోజుల్లో పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించి, సభ్యుల ఆమోదంతో తీర్మాన కాపీని సంబంధిత అధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.



## కొత్తపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**తాండూర్, మే 13, ప్రభాతవార్త**

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వ మన్నారు. రైతుల కోసం రేవంత్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొస్తున్నాడని, రైతుల కళ్ళల్లో ఆనందం కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## మేదరివాడలో తీరిన మంచినీటి సమస్య

**త్యాండూర్, మే 13, ప్రభాతవార్త :**

తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మేదరివాడ కాలనీవాసుల మంచినీటి సమస్య తీరింది. మంచినీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం ఉదయం ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. మహిళల ఆందోళనతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా చేశారు. అధికారులు తక్షణమే స్పందించి బోరింగ్ కు మోటర్ బిగించి కాలనీవాసులకు మంగళవారం సాయంత్రం మంచినీటిని సరఫరా చేశారు. మంచినీటి సమస్యను పరిష్కరించిన అధికార యంత్రాంగానికి, గ్రామపంచాయతీ సిబ్బందికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ మనోహర్, కార్యదర్శి దివాకర్, వార్డ్ సభ్యులు విష్ణుకళ్యాణ్, అరుణ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## రైతులు వడ్ల విక్రయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**- జిల్లా వ్యవసాయ అధికారిని ఈ సురేఖ**

**- పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల సందర్శన**

**చెన్నూరు, మే 13, ప్రభాతవార్త**

రైతులు తమ వడ్లను విక్రయించే క్రమంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఈ. సురేఖ రైతులకు సూచించారు. బుధవారం చెన్నూర్ మండలంలోని పలు గ్రామాల్లోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమశాతం నిర్దేశిత పరిమితిలో ఉండేలా చూడాలని, ఎఫ్ఏక్యూ (ఫెయిర్ అవరేజ్ క్వాలిటీ) ప్రమాణాలకు అనుగుణంగా వడ్లు తీసుకురావాలని రైతులకు సూచించారు. నాణ్యమైన ధాన్యం అందిస్తే కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ బానోత్ ప్రసాద్, ఎంఏఓ యామినీ, ఏఈఓలు, అంగ్రాజ్‌పల్లి, సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ

**సారంగాపూర్, మే 13, ప్రభాతవార్త:**

మండలంలోని చించోలి (బి) గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సౌజన్య ఆధ్వర్యంలో మట్ట సాయమ్మకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ముగ్గు పోసి భూమి పూజ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని నిరంతర ప్రక్రియగా చేపడుతుందనడానికి ఇదే నిదర్శనమని కమిటీ సభ్యులు తెలిపారు. ఇల్లు మంజూరు కావడంపై సాయమ్మ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోశెట్టి, వార్డు సభ్యులు శంకర్, వంజర్ అరుణ్ కుమార్, వడ్ల లక్ష్మణ్, షేక్ షఫీక్ పాల్గొన్నారు.

## భేటీ బచావో - భేటీ పడావోపై అవగాహన సదస్సు

**ఖానాపూర్, మే 13, ప్రభాతవార్త:**

పట్టణంలోని శాంతినగర్ కాలనీ తిమ్మాపూర్ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బేటి బచావో - బేటి పడావో కార్యక్రమంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మోనిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను సంరక్షించడంతో పాటు వారికి నాణ్యమైన విద్య అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కోరారు. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ శక్తి అధికారులు, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



# పీఎఫ్, పెన్షన్ సెటిల్‌మెంట్‌లు జాప్యం లేకుండా ప్రయాస్

## ❋ శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారుల సమీక్ష

**నస్పూర్, మే 13, ప్రభాతవార్త**



సింగరేణి ఉద్యోగుల పీఎఫ్, పెన్షన్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో బుధవారం ప్రయాస్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారంపై కీలక చర్చలు జరిపారు. సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన అంబటి భరత్ కుమార్‌కు ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ భరత్ కుమార్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పీఎఫ్, పెన్షన్ సెటిల్‌మెంట్‌ల కోసం సీకేర్స్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని, ఇందులో పెండింగ్‌లను ‘జీరో’ స్థాయికి తీసుకురావడమే ప్రయాస్ కార్యక్రమ ఉద్దేశమని వివరించారు. తాను గతంలో మైనింగ్ ఇంజనీర్‌గా పని చేసినందున కార్మికుల కష్టనష్టాలు తనకు తెలుసునని పేర్కొన్నారు. ఈపీఎఫ్ కన్నా సీఎంపీఎఫ్ ఎంతో మెరుగైనదని, ఉద్యోగులు పీఎఫ్ డబ్బులను చిన్న చిన్న కారణాల కోసం విత్‌డ్రా చేసి దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. ఆ పొదుపు మొత్తమే భవిష్యత్తులో కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు. జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో సీఎంపీఎఫ్ అధికారులను సంప్రదించడం కష్టంగా ఉండేదని, కానీ ఇప్పుడు అధికారులే నేరుగా మన వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరించడం శుభపరిణామమని అన్నారు. రీజినల్ కమిషనర్ భరత్ కుమార్ మైనింగ్ రంగం నుండి రావడం వల్ల క్షేత్రస్థాయి సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, ఇది పెండింగ్ క్లెయిమ్స్ త్వరగా పరిష్కారం కావడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరియా పరిధిలోని సంక్షేమ అధికారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ (2) గోవర్ధన్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, డిజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, సీనియర్ పీఓ సురేందర్, జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శి సందీప్, వివిధ గనుల సంక్షేమ అధికారులు, సీఎంపీఎఫ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, మే 13, ప్రభాతవార్త:**




మండల కేంద్రంలోని రైతు వేదికలో బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండలంలోని 208 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఆడబిడ్డల పెళ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ హామీని గాలికొదిలేసిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అయిర నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, సర్పంచ్ కోనేరు భూమన్న, మండల బీజేపీ అధ్యక్షుడు కాల్వ నరేష్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి సర్పంచ్‌లు పాటుపడాలి: ఎమ్మెల్యే

**భైంసా, మే 13, ప్రభాతవార్త:**



విద్యాభివృద్ధికి సర్పంచ్‌లు పాటుపడాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు. బుధవారం భైంసా పట్టణంలోని నరసింహ కళ్యాణమండపంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా సర్పంచ్‌లు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెసిడెన్షియల్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజన వసతితో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు పూనుకుందని, ముధోల్‌లో 225 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావ్ పటేల్, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**భైంసా, మే 13, ప్రభాతవార్త:**




విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి సుభాష్, దేగాం సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని దేగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి కాల శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎండల్లో తిరగకుండా ఉండేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు పాఠశాలలో క్రీడా పోటీలు, యోగా, క్విజ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు నీడపట్టునే ఉండి ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కారగిరి భోజన్న, ప్రధానోపాధ్యాయులు గంగాధర్, ఉపసర్పంచ్ శివాజీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాలలో డిజిటల్ ప్యానెల్స్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ భూమన్న

## ప్రభుత్వ కళాశాలలో డిజిటల్ ప్యానెల్స్ ప్రారంభం

**సారంగాపూర్, మే 13, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం సర్పంచ్ కోనేరు భూమన్న మంజూరైన నాలుగు డిజిటల్ ప్యానెల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నూతన పద్ధతుల్లో, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఆధునిక బోధన అందించేందుకు ఇంటరాక్టివ్ లెర్నింగ్ బోర్డులు ఎంతగానో దోహదపడతాయన్నారు. శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానంతో యువత ముందుకు వెళ్తున్న తరుణంలో డిజిటల్ విద్యాబోధన, ఏఐ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఇది చక్కని అవకాశమని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నూతన పద్ధతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సారంగాపూర్ మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## మార్కెట్ యార్డును పరిశీలించిన ఎమ్మెల్యే

**సారంగాపూర్, మే 13, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న మొక్కజొన్న, జొన్న కుప్పలను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. ఒకవైపు మొక్కజొన్న కొనుగోలు, మరోవైపు వరి ధాన్యం కోతకు రావడం, అకాల వర్షాల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిరక్ష్యం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడకూడదని, సకాలంలో పంటలు కొనుగోలు చేసి గోదాములకు తరలించాలని సూచించారు. ధాన్యం తరలించే సమయంలో రైతుల దగ్గర ఎలాంటి డబ్బులు తీసుకోకూడదని, గన్ని బ్యాగుల పంపిణీలో నిరక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎసీఎస్ చైర్మన్ అయిర నారాయణరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**నర్సాపూర్(జి), మే 13, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండల కేంద్రంలో బుధవారం నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్, సర్పంచ్ ప్రవీణ్, నాయకులు అర్జున్ సింగ్, దత్తూరం, రాజేందర్, సుధాకర్, హరిలాల్, శ్రీకాంత్ రెడ్డి, సాయికృష్ణ, చిన్ని, విజయ్ పాల్గొన్నారు.

